123078901

మతము మతముకు మధ్య ద్వేషము
జాతి జాతికి మధ్య జగడము
దేశదేశములందు రగడలు
దేనికయ్యా! మతప్రబోధలు.
కన్ను విప్పి చూడరోరన్నా - ఈ సాయిదేవుని
ఎన్నగా ఎర్దైన గలడన్నా
మొన్న షిరిడీ నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావన సేయు భక్తుల కన్నులందే మెలగునన్నా!

విద్యార్థులారా!

అన్ని మతములు ప్రతిపాదించిన సత్యము ఒక్కటే. అన్ని మతముల అంతిమ ధ్యేయము ఒక్కటే. మూర్ఖుడైన మానవుని మానవునిగా తీర్చిదిద్ది మాధవత్వంగా మార్చటమే మతము యొక్క ప్రధాన కర్తవ్యము. సదాచారమును సంరక్షించటమే మతము యొక్క ప్రధాన కర్తవ్యము. మానవుని మానసిక పరివర్తన గావించునదే మతము. కేవలము మానవుని జీవితమునకు కాక ఆత్మ విశ్వాసమును అభివృద్ధి గావించుటే మతము యొక్క లక్ష్యము. అన్ని మతములకు భద్రమైన పునాది నైతిక భావమే. నైతికత్వమే క్షీణించిన మతముతో పాటు మానవత్వము కూడను క్షీణించిపోతుంది. సత్ప్రవర్తన యొక్క ప్రధానమైన మూలము నీతియే. రాజ్యముగాని సమాజముగాని లేక వ్యక్తిగాని నీతిపైననే ఆధారపడి వుంటున్నవి. నీతిని కోల్పోయిన రాజ్యము సమాజము వ్యక్తిత్వము కూడను శిథిలమై పోతుంది. సమస్త సిరిసంపదలు, భోగభాగ్యములు నైతిక విలువలపైననే ఆధారపడి వుంటున్నవి. అట్టి నీతి తత్వాన్ని మానవుడు అనుభవించుటం నిమిత్తమై యీ మతములు వచ్చాయి. శరీరము, మనస్సు, బుద్ధి మూడింటి యొక్క సమన్వయమును కావించే సదాచారమే మతము. నడత యొక్క పరిపూర్ణస్థితియే నీతి. నీతికి మరొక పేరు ధర్మము. ధర్మమనగా ప్రియం అని విలువ అని కూడను అర్థం. ప్రియముతో కూడిన నైతిక భావమును అనుసరించినప్పుడే జగత్తుకు విలువైన ఘనమైన కీర్తిసంపదలు వాటిల్లాయి. వస్తువునకు కాక విలువ వున్నదిగాని ధర్మమునకు యిట్టిది అట్టిది అని నిర్ణయించుటము అసాధ్యం. ధర్మమునకు మరొక పేరే నీతి. నీతికి మరొక పేరే నిస్వార్థప్రేమ. ప్రేమ తత్వాన్ని పొందే నిమిత్తమై సమాజం సుక్షేమముగా నిలిచే లక్ష్యముతో యీ మతములు స్థాపిస్తూ వచ్చారు.

దేశకాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని ఆనాటి ప్రభువులు ఋషులు ఒక విధమైన శృంఖలమైన నిబంధనలను శాసించుకుంటూ వచ్చారు. ఇవన్నీ మానవతా విలువలను పోషించుకునే నిమిత్తము మానవతా విలువలను నిలబెట్టుకొనే నిమి

123078902

త్రము ఏర్పడినవే. వేద శాస్త్ర ప్రమాణమును పురస్కరించుకొనియే యీవిధమైన నిబంధనలను నిర్ణయిస్తూ వచ్చారు. ఇవి ఎప్పుడు, ఎక్కడ, ఎవరిచేత ప్రారంభమైనవి ఎవ్వరు కూడను యింతవరకు నిర్ణయించలేకపోయారు. ఇది మానవతా దివ్యత్వమును పోషించుకునే నిమిత్తమై ఏర్పడిన దివ్యమార్గముగా వారు విశ్వసిస్తూ వచ్చారు. క్రమక్రమేణా కాలము మార్పు చేత అనేక శాఖోపశాఖలు దీనికి చేరుతూ వచ్చాయి. మహర్షుల శాసనాల వల్లను వారి సంకల్పముల చేతనే యీ శాఖోపశాఖలు అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఈ శాఖలకు మహర్షుల పేర్లు నిర్ణయిస్తూ వచ్చారు. సమాజము యొక్క సుక్షేమ నిమిత్తమై వశిష్ఠశాఖ, గౌతమశాఖ, పరాశర శాఖ, విశ్వామిత్ర శాఖ. యీ విధమైన అనేక శాఖలను వారు నిర్ణయిస్తూ వచ్చారు. భారతీయుల మతము యొక్క కాలము కాని నాయకుడు కాని నిర్ణయించిన వ్యక్తి కాని ఏవిధంగా ఎవ్వరూ కూడను ఇంతవరకు గుర్తించలేదు. ఇవి అన్ని వేదప్రమాణములను పురస్కరించుకొని నిర్ణయించినవి. మిగిలిన మతములు రెండువేలు; రెండువేల ఐదు వందల సంవత్సరములనుంచి ప్రారంభమౌతూ వచ్చాయి. ఈ మతములకు ప్రవక్తలు నిర్ణయమైపోయారు. ఈ మతప్రవక్తలు అనేక విధములైన ఆలోచనలు చేసి అందరి సమభావమును గుర్తించి మానవత్వానికి సమన్వయము గావించుకునే మార్గాలను బోధిస్తూ వచ్చారు.

ఏ మతము కూడను ఒక మతమునకు ఒక మతము విరుద్ధమైన భావములు నిర్ణయించలేదు. కాని దురదృష్టవశాత్తు వ్యక్తులలో వుండిన భేద భావములు సంకుచిత తత్త్వములు అనేక విధములైన భేదములను అభివృద్ధి గావించినవి. ఒక్కొక్క మతమునందు ఒక్కొక్క సంకలనమును ప్రవచించి తద్వారా సంఘమునందు మతద్వేషములనే మారణహోమములు తయారౌతూ వచ్చాయి. నిజమునకు మతమునకు మతమునకు ఎట్టి భేదము కాని ఎట్టి ద్వేషము గాని వుండుటకు అవకాశము లేదు. ప్రాచీనమైన భారతీయ మతము కేవలము వైదిక సాంప్రదాయమును పురస్కరించుకొని, దీనినే హైందవ సాంప్రదాయమని ప్రబోధిస్తూ లోకాస్సమస్తా సుఖినో భవంతు అని సర్వుల క్షేమాన్ని దృష్టియందు వుంచుకొని ప్రబోధిస్తూ వచ్చింది. ఇస్లాం మతము యొక్క ఆశయము కూడను యిదియే. ఇస్లాం అనగా పర్షియన్ భాషలో అనేక విధములైన పవిత్రమైన అర్థములున్నవి. ఇస్లాం అనగా శరణు అని శాంతి అని కూడను అర్థము. భగవంతునకు శరణాగతుడై తోటి మానవుల చేత శాంతి జీవితమును గడపమనియే యిస్లాం మతము అంతరార్థము. ఇస్లాం మతము ఖురాను యందు పవిత్రమైన సూక్తులు ప్రబోధిస్తూ వచ్చింది. ఇందులో సలాత్ అని ఒక పదము జకాత్ అని రెండవ పదము. సలాత్ అనగా స్థిరమైన భక్తితో భగవంతుని ఆరాధన చెయ్యాలి. జకాత్ అనగా దీనులైన మానవులకు ధానధర్మములు ఆచరించి తోటి మానవులను సంరక్షించుటకు పూనుకోమని అర్థము. అదియే భారతీయ ఇతిహాస పురాణములయందు 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అని అష్టాదశ

పురాణముల సారమును వ్యాసుడు అందిస్తూ వచ్చాడు. Help ever hurt never. ఈ విధమైన సూక్తులను ప్రాణసమానమైన వేదములుగా భావించుకుంటూ ఆనాటి సర్వమతముల వారు సమన్వయం చేత జీవిస్తూ వచ్చారు. సత్యము, శాంతి, ప్రేమ, సహన సానుభూతులు మతమునకు పంచప్రాణములుగా విశ్వసిస్తూ వచ్చారు. మతవిషయములను సంప్రదించే సమయమున వాదోపవాదములకు అవకాశమివ్వకూడదు. శాంతములో పరిష్కరించుకోవాలని కూడను ఖురాను ప్రబోధించింది. ఇదే విధముగనే అన్ని మతముల ప్రయోజనములు ప్రమాణములు, ప్రధానమైన గమ్యములు సత్యము, ధర్మమే. అయితే ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క విధమైన దానిని లక్ష్యమునందుంచుకొని దాని అంతరార్థమును గుర్తించుకొనలేక ఒకరికొకరికి భేదాభిప్రాయములు పెంచుకుంటూ వచ్చారు. ఇది ఎట్లు వున్నదనగా ఒకరూపాయికి 192 దమ్మిడిలు అని ఒకడంటాడు. కాదు కాదు రూపాయికి 16 అణాలు అని యింకొకడు వాదిస్తూ వస్తాడు. ఇంకొకడు యిది సరియైనది కాదు. రూపాయికి నాలుగు పావలాలు అంటాడు. ఇంకొకరు రూపాయికి 2 అర్ధరూపాయలు అన్నాడు. 2 అర్ధరూపాయలుగాని, 4 పావలాలుగాని, 16 అణాలుగాని, 192 దమ్మిడిలుగాని అన్నీ ఒకటే. ఈ సమత్వాన్ని గుర్తించుకోలేక వారివారి సంకుచిత భావముల చేత భిన్నభిన్నంగా విచారిస్తూ విమర్శిస్తూ వచ్చారు.

అన్నింటికిని ఆధారమైన పునాది నీతి. నైతిక విలువ లేకపోతే మానవత్వమే నిలువదు. ఆనాడు జనాభా చాలా తక్కువగా వుండుటంచేత అక్కడికక్కడ వారే కొన్ని నిశ్చితమైన నిబంధనలు నియమించుకొని జీవితాన్ని ప్రశాంతముగా అనుభవిస్తూ వచ్చారు. కాలము మారుకొలది జనాభా పెరుగుకొలది వారివారి భావములు కూడను వ్యాప్తిగావించుకుంటూ వచ్చారు. ఆనాడు యావత్ప్రపంచము ఐదుకోట్ల జనాభా. ఈనాడు ప్రపంచమంతా చేరి 550 కోట్లు. కాలము మార్పుచేత నీతినిజాయితీల భావములు కూడను పలుచబడుతూ వచ్చాయి. దీనికి చిన్న ఉదాహరణము. మీకందరికీ తెలుసు. భారతదేశములో స్వాతంత్ర్యమును సంపాదించాలని గాంధీ యింకా కొంతమంది వ్యక్తులందరు చేరి కాంగ్రెస్ అనే పేరుతో విదేశీయులను ధిక్కరిస్తూ వచ్చారు. ఇది 50-55 సంవత్సరముల ముందువరకు వుండవచ్చు. ఈలోపలనే కాంగ్రెస్ పేర్లు ఎన్ని మారిపోయినాయి. వ్యక్తి యొక్క ప్రభావమును పురస్కరించుకొని దీనిపేర్లు మార్పు చెందుతూ వచ్చాయి. ఒకటి ఓల్డ్ కాంగ్రెస్, రెండవది ఆర్ కాంగ్రెస్, మూడవది ఎస్ కాంగ్రెస్, నాల్గవది ఐ కాంగ్రెసు. ఈ విధంగా వ్యక్తి వ్యక్తి యొక్క బలమును పురస్కరించుకొనియే యీ పేర్లు మార్పు చెందుతూ వచ్చాయి. ఇంకా ఇంకా ఎంతవరకు పోతాయో. ఏ మొదలు జెడ్ వరకు కూడా పోతాయి.

కొన్నివేల సంవత్సరములకు పూర్వము ప్రారంభమైన ఈ మతములు యింతమాత్రం మార్పు చెందినాయంటే యిది గొప్పతనము కాదు. భారతీయుల సదాచార సాంప్రదాయములను అనుసరించిన సనాతన ధర్మము కనుకనే ఎట్టి మార్పులు చేర్పులు లేకుండా అనాదికాలము నుంచి ప్రదీప్తంగా వికసిస్తూ వస్తుండాది. సనాతన ధర్మమనేది భారతీయు

లకు మాత్రమే కాదు. యావన్మానవ జాతికి సంబంధించినది. సనాతన ధర్మమనే పేరును విన్నంత మాత్రముననే యిది భారతీయుల ధర్మము అని విదేశీయులు భ్రమిస్తున్నారు. మానవత్వమునకు సంబంధించిన యీ ధర్మము ఒక వ్యక్తిత్వమునకో ఒక దేశమునకో ఒక కాలమునకో సంబంధించినది కాదు. విశాలమైన అనంతమైన, పవిత్రమైన యీ ధర్మములను యీనాడు అనేకమంది ఏదో ఒక అల్పభావములో అనుభవించటానికి ప్రయత్నిస్తున్నారు. నీతి అనే చిన్నపదమును అనేక విధములుగా వ్యాఖ్యానించే నిమిత్తమై యిలియట్ వే ఆఫ్ లైఫ్ జీవితప్రధాన మార్గమన్నాడు. నీతి లేకపోతే జాతియే లేదని అతని విశ్వాసము. ఇట్టి సమస్త సారములతో సమస్త భావములతో సమస్త శక్తులతో సనాతన ధర్మము కూడినటువంటిది. ఇట్టి ధర్మమును యీనాడు సంకుచితమైన మార్గములో ప్రవేశపెట్టి ఒక వ్యక్తిత్వమును మాత్రమే గుర్తించటానికి తగిన ఆచారముల యందు దీనిని అనుభవిస్తున్నారు. ఇది ఆకారమునకు సంబంధించినది మాత్రమే కాదు. ఆచారమునకు సంబంధించినది మాత్రమే కాదు. ఆత్మతత్వమునకు సంబంధించినది. ఆత్మవిశ్వాసమును అభివృద్ధి గావించుకునే నిమిత్తమై యీ ధర్మము ఏర్పడినది. అన్ని దేశీయులకు అన్ని ప్రాణులకు ఆత్మ ఒక్కటే.

దీనికి ఒక చిన్న ఉదాహరణము. మనదేహము పంచకోశములతో కూడినది. మొదటి కోశము అన్నమయ కోశము. రెండవది ప్రాణమయ కోశము. మూడవది మనోమయము. నాల్గవది విజ్ఞాన మయము. ఐదవది ఆనందమయము. ఈ ఐదు కోశములు అన్ని దేశీయులకు అన్ని ప్రాణులకు వుంటున్నాయి. ఈ కోశములు భారతీయులకు మాత్రమే వుంటుండాయి ఇతర ప్రాణులకు ఇతర దేశీయులకు లేదని ఎవ్వరు వాదించుటకు వీలుకాదు. అన్నమయ కోశమనగా ఏమిటి? అన్నము చేత ఏర్పడినది యీదేహము. అన్నములోనే జీవించేది యీ దేహము. అన్నము చేతనే క్షీణించేది యీదేహము. షడ్వికారములు అన్నము చేతనే సంప్రాప్త మౌతాయి. కనుక దేహము మాత్రమే అన్నమయ కోశము అన్నారు. తరువాత ప్రాణమయకోశము. ఇది ఐదు కర్మేంద్రియములు ఐదు వాయువులు (ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన) ఈ రెండింటి యొక్క చేరిక చేత ప్రాణమయ కోశంగా రూపొందుతూ వచ్చింది. ఇంక మనోమయ కోశము. ఐదు కర్మేంద్రియముల చేతను ఐదు జ్ఞానేంద్రియముల చేతను సంకల్ప వికల్పములతో కూడిన మనస్సు యొక్క తత్వమే. ఇంక విజ్ఞాన మయకోశము. శబ్ద స్పర్శ రూప రస గంధములతో కూడిన బుద్ధియే విజ్ఞానమయ కోశము. ఇంక ఆనందమయ కోశము. ప్రియము, మోదము, ప్రమోదము అని మూడు రకములు. మనకు యిష్టమైన వ్యక్తినిగాని, యిష్టమైన వస్తువునుగాని, యిష్టమైన విషయమునుగాని మనము విన్నప్పుడు కలిగే సంతోషమే ప్రియము. అట్టి యిష్టమైన వస్తువో, లేక విషయమునో, వ్యక్తినో మనం పొందినప్పుడు కలిగే సంతోషమే మోదము. అట్టి వ్యక్తితో, అట్టి విషయముతో, అట్టి వస్తువుతో అనుభవించే సమయములో కలిగే

123078905

ఆనందమే నిజానందము. ఇది ప్రమోదము. నీకు ఇష్టమైన ఫలమును గురించి ఎవరైనా చెప్పినప్పుడు నీకు కొంత ఆనందం కలుగుతుంది. లేక ఇష్టమైన వ్యక్తిని గురించి వర్ణించినప్పుడు నీకు చాలా ఆనందం కలుగుతుంది. దీనికి కారణము ఆవ్యక్తిపైన, ఆవస్తువుపైన వుండిన నీప్రీతియే. కనుక దీనిని మనము ప్రియము అన్నాము. ఈ వస్తువును నీవు బజారు లోవెళ్లే సమయములో దర్శించితివంటే అక్కడ మరింత ఆనందం కలుగుతుంది. చూచినవస్తువును నీవు అందుకొని అనుభవించినావంటే మరింత ఆనందం కలుగుతుంది. భగవంతుని దివ్యశక్తులను దివ్యవిభూతులను దివ్యప్రేమను గురించి శాస్త్రములు, ఉపనిషత్తులు ఇతిహాసములు పురాణములు వర్ణించే సమయములో కలిగే సంతోషము నీకే ప్రియము అన్నారు. అట్టి విన్న విషయాన్ని నీవు ఆచరణలో పెట్టినప్పుడు కలిగే ఆనందము మోదము అన్నారు. అట్టి దివ్యత్వముతో నీవు ఏకమై అనుభవించే సమయములో కలిగే ఆనందమే నిత్యానందము అదే ప్రమోదము. భగవంతుని గురించి వినటము, విన్న విషయాన్ని ఆచరణలో పెట్టటము, ఆచరించిన దాన్ని అనుభూతిలో తెచ్చుకోటము ఇదే ప్రియము, మోదము, ప్రమోదము అని. కనుకనే యీ ఆనందమనేది ఐదవ కోశము.

దీనికి కోశము అని పేరెందుకు వచ్చింది? ఒకదానిలో ఒకటి చేరి వుండటంచేతనే కోశములు అని పేరు వచ్చింది. కత్తిని ఒక వరలో పెట్టినాము. అప్పుడు వరకు కోశము అని పేరు. బియ్యమునకు పొట్టు చేరి వుంటుండాది. మూసిపెట్టి వుంటుండాది. ఈ పొట్టు ఒక కోశము. చింతవిత్తనమునకు చింతపండు కవరై వుంటుండాది. ఆ చింతపండును తీసివేసినప్పుడే చింతగుల్ల మనకు కనుపిస్తుంది. కాబట్టి చింతగుల్లకు చింతపండే ఒకవిధమైన కోశము. అదేరీతిగనే బిడ్డ తల్లిగర్భములోపల వుంటుండాది. అందుకనే గర్భకోశము అది దాని పేరు. ఒక వస్తువును మరొక వస్తువు ఆవరించి దానియొక్క రూపనామములు తెలియకుండా కోశము అనేది కప్పివేస్తుంది. దీనికే కోశము అని పేరు. అన్నమయములో ప్రాణమయము ఒక కోశముగా వుంటుండాది. ప్రాణమయమైన దానిని అన్నమయకోశమనేది కప్పిపుచ్చింది. ఈ ప్రాణమయ కోశము లోపల మనోమయము చేరి వుంటుండాది. మనోమయ కోశమును ప్రాణమయకోశము కప్పిపెట్టింది. తరువాత విజ్ఞానమయము. ఈ మనోమయ కోశములో చేరి వుంటుండాది. విజ్ఞానమయమును ఈ మనోమయము కప్పిపుచ్చింది. ఈ విజ్ఞానమయకోశములో ఆనందమయము మరుగుపడింది. ఈ ఆనందమును విజ్ఞానమయము కప్పిపుచ్చింది. ఈ ఆనందమయకోశములోనే ఆత్మ వుంటుండాది. ఇన్ని కోశములలో కూడినది ఆత్మ కనుక ఈ కోశములు ప్రతిమానవునికి ప్రతిదేశము వానికి కూడ వుండటంచేత అందరికి ఇది సమన్వయమైనదే. ఇందులో భేదమనకెట్టి అవకాశమును లేదు. కనుక ఆత్మాన్వేషణ అనేది సర్వప్రాణులకును సమన్వయమైనది. సమానాధికారం కలిగినది. ఐతే అట్టి అభీష్టము మాత్రము రావాలి. దీనిని

123078906

పొందాలి. దీనిని చెందాలి. దీనిని అనుభవించాలి అనే అభిలాష ప్రతి మానవునిలోనా పుట్టును.

ఈ ఐదు కోశములకును ఐదు భూతములు ఉంటున్నాయి. ఆకాశము మొదటి భూతము. రెండవది గాలి. మూడవది అగ్ని. నాల్గవది జలము. ఐదవది ప్రకృతి భూమి. ఈ పంచభూతములలో ఒక్కొక్క భూతము నుండి మానవత్వమునకు ఏయే అంగములు పుట్టిస్తున్నాయి అనేదాన్ని మనం గుర్తించాలి. పంచ భూతములు మానవుని ఆకారంగా వుంటాయి. ఎట్లనగా ఆకాశమునుండి రాగము, ద్వేషము, భయము, లజ్జ యిలాంటి వంటా పుడుతున్నాయి. మానవుని యందుండిన రాగము, ద్వేషము, భయము, లజ్జ యివన్నీ ఆకాశము యొక్క అంశములే. మనదేహము లోపల గాలి నుంచి వచ్చినవి ఏమిటి? నడక, కదలిక వణుకుడు, ఉచ్ఛ్వాస నిశ్వాసములు యివన్నీ వాయువునుండి ఆవిర్భవించినవి. ఇంకా అగ్ని నుండి వచ్చినవి ఏమిటి? ఆకలి నిద్ర దప్పి భయము యివన్నీ అగ్నినుండి ప్రారంభమైనవి. ఇంక జలమునుండి వచ్చినవి ఏమిటి? కఫము, మూత్రము, రక్తము యివన్నీ జలమునుండి ఆవిర్భవించినవి. ఇంక ప్రకృతి నుండి వచ్చినవి ఏమిటి? చర్మము, కండరములు, నరములు, ఎముకలు, గోళ్ళు, వెంట్రుకలు యివన్నీ ప్రకృతి నుండి ఆవిర్భవించినవి. కనుకనే ప్రతి మానవునియందును ఈ ఆకాశ వాయు అగ్ని జల పృథ్వీ అంశములు సమంగానే వుంటున్నాయి. ఇట్టి సమత్వమైన దైవదృష్టిని యిది నాది యిది నీది నాదెక్కువ నీదెక్కువ అని వాదించుకోటానికి ఎవరికీ అధికారము వుంటుండాదా. ఈ విధంగా విచారించుకునేవారు తెలివితక్కువ వారనే చెప్పవచ్చు. సత్యాన్ని గుర్తించలేని వ్యక్తులని కూడను చెప్పవచ్చును. అంతర్జ్ఞానాన్ని చక్కగా అర్థం చేసుకుంటే ఈ సత్యాన్ని తప్పక గుర్తించగలరు. దేశకాల పరిస్థితుల ప్రభావములకు మనము యేమాత్రము కట్టుబడరాదు. ఇది సంకుచితమైన జీవితము. విశాలమైన జీవితాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. దివ్యమైన, భవ్యమైన మార్గాన్ని మనం అనుసరించాలి.

మత భేదములు ఎక్కడ కూడను లేవు. మతి భేదములు మాత్రమే వుంటున్నాయి.

మతములన్నిచేరి మంచినే బోధించె
తెలిసి మెలగవలెను తెలివితోడ
మతులు మంచివైన మతమేమి చెడ్డది.

మతులు చెడ్డవిగా వుంటున్నాయి. కాని మతములో యేమాత్రము చెడ్డవి లేవు. అన్ని మతములు ప్రతిపాదించిన సత్యము ఒక్కటే. అన్నిమతముల యొక్క గమ్యము ఒక్కటే. అన్ని గ్రంథముల సారము ఒక్కటే. అన్నింటి చేరికను ఒక్కటే. మతముల యందు యీనాడు అనేక విధములైన భేద భావములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. ఇది సరియైనది కాదు. ప్రతి మానవుడు తన దివ్యమైన నీతి నిజాయితీలను ఆధారం చేసుకొని దానిని పోషించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ప్రతి మానవునకు నీతి ప్రధానమైన జ్యోతి. ఈ జ్యోతియే

123078907

లేకపోతే మనము అంధకారములో మునిగిపోతాము. అదే

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

ఫస్ట్ స్పీకర్ పిల్లవాడు చెప్పాడు. 'వేదాహమేతమ్ పురుషం మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అని. మహర్షులు భగవదన్వేషణ జరిపి మేము భగవంతుని గుర్తించాము. మేము చూడగలిగాము. మేము తెలుసుకున్నాము. అని లోకానికంతా చాటుతూ వచ్చారు. వేదాహమేతం పురుషం మహాన్తమ్' ఆ పవిత్రమైన తేజోవంతమైన పురుషుని మేము చూడగలిగాము. ఆ జ్యోతిర్మయమైన పురుషుణ్ణి మేము దర్శించగలిగాము. ఎక్కడ దర్శించాము. బయట ప్రపంచమునందా? కాదు కాదు. తమ తమ హృదయములందే. ఎక్కడ? తమసః పరస్తాత్. ఆ తమస్సుకు అవల వుండిన పరమపురుషుని దర్శించాము. తమస్ అనగా అజ్ఞానము.

ఇక్కడ మనము ఒక విషయాన్ని గుర్తించాలి. ప్రతిమానవుడు ఏదో ఒక సమయంలో దుఃఖిస్తుంటాడు. ఈ దుఃఖమునకు కారణమేమిటి? అని విచారిస్తే ఈ జన్మనే దుఃఖానికి కారణం. జన్మనే లేకపోతే దుఃఖమే లేదు. ఐతే ఈ జన్మానికి కారణమేమిటి? కర్మానుబంధీని మనుష్యలోకే' కర్మల వల్లనే ఈ జన్మం మనకు ప్రాప్తించింది. ఈ కర్మకు కారణం ఏమిటి? రాగద్వేషములే కర్మకు మూలకారణము. మన ఇష్టము లేకపోతే కర్మలు మనము ఆచరించము. అదే రాగము. కనుక రాగద్వేషములు రెండూ చేరి కర్మను సృష్టిస్తూ వచ్చాయి. ఈ రాగద్వేషములకు ఆధారమేమిటి? అదే అహంకారము. నాకంటె అందమైనవాడు ఒకడు వున్నాడు, నాకంటె ఎక్కువ మార్కులు తెచ్చుకున్నవాడొకడున్నాడు, నాకంటె బలవంతుడు ఒకడున్నాడు అని యీ విధమైన అహంకారము వుండటం చేతనే రాగద్వేషములు ప్రారంభమౌతున్నాయి. ఈ అవివేకమునకు మూలకారణమేమిటి? అదే అజ్ఞానము. కనుక యీ అజ్ఞానమునకు ఆ దుఃఖమునకు చక్కని చెలిక వుంటుండాది. అందువల్లనే దుఃఖము ప్రాప్తిస్తూ వుండాది. అజ్ఞానం పోవాలనుకుంటె అవివేకం నిర్మూలం కావాలి. అవివేకం నిర్మూలం కావాలంటె అహంకారము పోవాలి. అహంకారం పోవాలంటె రాగద్వేషములు అణగాలి. రాగద్వేషములు అణగాలంటె కర్మలు నశించాలి. కర్మలు నశించాలంటె జీవితము వుండకుండా వుండాలి. జీవితమే లేకపోతే దుఃఖమే వుండదు. కనుకనే యీ జన్మయింక నాకక్కరలేదు అని జన్మసార్థకమునిమిత్తమై సాధనలు చేస్తూ వచ్చారు. జన్మ ఎందుకు రాహిత్యం కావాలని కోరుతూ వచ్చారు. అంటే యిదిగో యీ కారణమే. 'పునరపి జననం పునరపి మరణం' ఈ రెండు కూడను దుఃఖమునకు హేతువై పోతున్నాయి. ఈ జనన మరణములే లేకపోతే దుఃఖములకు మనము లేశమాత్రము గురికాము. అట్టి జన్మరాహిత్యమునకై చేసే యీ ఆధ్యాత్మిక సాధనలు

123078908

కేవలం ఒక సాక్షాత్కారం కోసమని గాని యింకే విధమైన అనుభూతికి అతీతమైన ఆనందాన్ని అనుభవించటానికి కాని కాదు. మనమే చక్కెరగా తయారై పోవటం. ఇప్పుడు సుగర్ తినేవారుగా వున్నాము. మనమే షుగర్ గా మారిపోతే షుగర్‌పైన ఆశనే మనకుండదు.

'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' తాను బ్రహ్మగా మారిపోవటమే. అట్టి మార్పు కలిగించేదే మతము. మూర్ఖుడుగా వుండిన వానిని మానవునిగా మార్చి మానవుని నుండి మాధవత్వానికి తీసుకొని పోయేది మతము. ఇంత పవిత్రమైన దివ్యమైన మతములను యీనాడు మనము చిల్లర విషయాలలో ఉపయోగపెడుతున్నాము. రెలిజియన్. Realisation is religion. మనము మన తత్వాన్ని గుర్తించుకోటమే Religion. మనకు మనము realise చెయ్యాలి. మనం ఎవరు? మనం ఎవరు? మనం ఎవరు? యిదే వేదాంత ప్రబోధ. వేదాంతమనగా ఏమిటి? నేను నేను నేను అనే దాని అంతమే వేదాంతము. ఈ నేను యొక్క అంతమే వేదాంతము. వేదమే ద్వైతము. ఈ అన్నింటియందు కూడను అనేకరకములైన ప్రబోధలు జరుపుతూ వచ్చింది లోకములో. మధ్యకాలములో ఈ మతములను తిరిగి సంరక్షించదలచి శంకరులవారు ఆవిర్భవించారు. సర్వమతములయందు వుండే సమన్వయత్వాన్ని ప్రబోధించటానికి పూనుకున్నాడు. ఇదే అద్వైత మతము అన్నారు. అద్వైతమనగా అనేకత్వములో వున్న ఏకత్వము. ఇలాంటి ఏకత్వమునే ప్రబోధిస్తూ వచ్చాడు. ఆ అద్వైతము శాశ్వతంగా ఈ జగత్తునందు నిల్చకుండా పోవటానికి కారణమేమిటి? బోధించటం అద్వైతం ఆచరించటం ద్వైతం కావటంవల్ల ఈ అద్వైత మతమునకు అంత పటుత్వము లేకపోయింది. అంతా ఒక్కటే అనుకున్నప్పుడు బ్రహ్మసత్యం జగన్మిథ్య అని జగత్తునెందుకు మిథ్య అనాలి! తరువాత సర్వం విష్ణుమయం జగత్ అని మరొకటి పుట్టించటానికి కారణమేమిటి? ఈ విధమైన ద్వైత మార్గమునందు అద్వైతాన్ని బోధించటం చేతనే అద్వైతానికి తగిన బలము లేకపోతూ వచ్చింది. ఒకడు Master అని యింకొకడు servant అని యీ విధమైన భేదభావము ఉండకూడదు. లేత వయస్సునందే జగత్తంతా సంచరించి అందరితో వాదించి విజయాన్ని సాధించాడు శంకరుడు. ఇతరులతో వాదించి విజయాన్ని సాధించాలనుకుంటే అక్కడ ఒక desire వుండాలి కదా. ఈ desire అనేది ఆశ అనేది, కోరిక అనేది ద్వైతమునకు సంబంధించినదే. అద్వైతమునకు కాదు. ఈ రకమైన దాని చేతనే వాదోపవాదములు బయలుదేరి మరొకరు యింకొకరు ఆవిర్భవిస్తూ వచ్చారు.

రామానుజులవారు విశిష్టాద్వైతము అన్నారు. విశిష్టాద్వైతమంటే ఏమిటి? వ్యక్తులు విషయములు వస్తువులు విడివిడిగా వుండినప్పటికిని యీ అన్నింటియందు ఒక దివ్యత్వమనే అంశము వుంటుండాది. ఈ దివ్యత్వాన్ని అంశంగా భావిస్తూ వచ్చాడు రామానుజులవారు. అంశము అనేది ఒకటి వుంటున్నప్పుడు విరుద్ధంగా దానికింకొకటి వుంటున్నది కదా. బింబము అనేది వుండినప్పుడు ప్రతిబింబము వస్తుంది. Sound అనేది వుండినప్పుడే రీసౌండ్ అనేది వస్తుంది. రియాలిటీ వుండినప్పుడే ప్రతిబింబము అనేది ఒకటి వస్తుంది. కాబట్టి

123078909

ఇక్కడ Reflection, Reaction, Resound అనేవి వున్నాయి. అనే దాన్ని చక్కగా అర్థమయ్యేటు ట్లుగా బోధించారు. జీవుడు సాధన చేత దేవునిలో ఐక్యము కావచ్చును, చేరవచ్చును అనేది అతని సిద్ధాంతము.

ఇది సరియైనది కాదు. జీవుడు జీవుడే. దేవుడు దేవుడే. ఆయానందాన్ని అనుభవిస్తూ వుండవచ్చును కాని జీవుడు దేవుడు కాదు. దీనికి చక్కని ఆదర్శం ఒకటిది. మనము పాలను తీసుకుందాము. ఈ పాలను కాచి తోడంటు వేసినప్పుడు యిది పెరుగుగా మారిపోతుంది. ఈ పెరుగును మథనము చేసినప్పుడు అందులో వెన్న బయలు దేరుతుంది. ఈ వెన్నను కాచిన తరువాత అది నెయ్యిగా రూపొందుతుంది. ఐతే యీ నెయ్యి ఎక్కడనుండి వచ్చింది? ఈ నెయ్యికి ఆధారము వెన్న. ఈ వెన్నకు ఆధారము పాలే. పాలలో ప్రతి బిందువునందు ప్రతి అణువునందును వెన్న వుంటుండాది. ఉండినప్పటికి మనకు గోచరించదు. దానిని చేయవలసినదానిలో మనము ఆచరించినప్పుడే ఆ వెన్న వేరుగా వస్తుంది. కనుకనే పాలు అనేది అద్వైతము. ఈ పాలనుంచి వచ్చిన సారమే వెన్న. వెన్నను తీసివేసినప్పుడు మజ్జిగ వేరుగా ఐపోతుంది. పూర్తి వెన్నలోపల మజ్జిగ లేదు. మజ్జిగ లోపల వెన్న లేదు. ఇక్కడ మజ్జిగ వెన్న రెండుగా వుంటున్నాయి. ఐతే వెన్న విశిష్టమైనది. పాలసారమంతా వెన్నలో వుంటుండాది. మనం పాల గురించి యోచించనక్కరలేదు. వెన్ననే అతి ప్రధానము. అని రామానుజులవారు విశిష్టమైన అద్వైతంగా నిరూపిస్తూ వచ్చాడు. తరువాత మధ్వాచార్యులు. అతను కృష్ణ భక్తుడు. ఎప్పుడు చూచినా కృష్ణుడు వేరుగాను నేను వేరుగాను వుంటుండి అతనిలో ఆనందాన్ని అనుభవించుటే ప్రధాన కర్తవ్యమన్నాడు. నేనే కృష్ణుడైపోతే ఆనందం యొక్క మాధుర్యం ఏమాత్రం నాకు అర్థము కాదు. కృష్ణుడు కృష్ణుడుగానే వుండాలి. నేను దాసుడుగానే వుండాలి. నేను అనుభవించేవాడు. తాను ఆనందించేవాడు. అతను నాయకుడు. నేను నాయిక. మధ్వాచార్యుడు యీ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యము కోరుతూ వచ్చాడు. ఏది చేసినప్పటికిని కృష్ణుని యొక్క సంబంధము తోనే ఆచరించటానికి ప్రయత్నించాడు. ఆ కృష్ణుడు సర్వత్రా వుంటున్నాడు. ఉండినప్పటికిని తాను నాకు వేరుగానే వుంటున్నాడు. అందువల్లనే పురందరదాసు కూడా చెప్పాడు.

హుట్టిసిద తాయ్తందె ఇష్టమిత్రను నీనె
ఆప్త బంధువు సర్వ బళగ నీనె
శ్రేష్ఠ మూరితి స్వామి నీ నిరువతనక
నాన్యాకె బడవా, నాన్యాకె పరదేశి.

పెట్టిల పెట్టిన ఆప్తాభరణాములంతా నీవే. నన్ను పుట్టించిన తల్లి తండ్రి మిత్రుడు కూడ నీవే. అలాంటి నీవు నాకుండినంత వరకు నాకి తరులలో పని లేదు. ఈ జగత్తే నాకక్కరలేదు.

విద్యే హేళువ నీనె బుద్ధి కలిసున నీనె.
ఉద్ధారకర్త మమ స్వామి నీనె

123078910

ముద్దు శ్రీ పురంధర విఠల నిన్నడి మేలె
బిద్దుకొండిరువ ఎనగేల రాభయవో
నాన్యాకె బడవా నాన్యాకె పరదేశి.

నేనెందుకు పరదేశినౌతాను. నేనెందుకు దరిద్రుడౌతాను. నేను దరిద్రుడనే కాను. నేను మహాశ్రీమంతుడను. కృష్ణా! నీవొక్కడుంటుంటే నాకీలోకంలో అక్కరలేదు. నీవు నీవుగానే వుండాలి. నేను నేనుగానే వుండాలి. మన యిద్దరికి కూడను సన్నిహిత సంబంధ బాంధవ్యమనేది ప్రేమ. అదే కరెంటు బల్బును వైరు వుంటే ఏవిధంగా ఆబల్బు ప్రకాశిస్తూ వుంటుందో ఆదేవిధంగానే నీకూ నాకూ మధ్యలో ఈప్రేమ అనే వైరుండాలి. ఇదిమాత్రం ఎడబాయుటానికి వీలుకాదు. ఈ సృష్టికంతా ఎవరు కారణం? నీవే కారణం. నీకంటె వేరు మరొకడు లేడు. చిత్రకారుడవు నీవే. కవిత్వము నీవే.

చిత్రంబులు త్రైలోక్యపు
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

అన్నాడు. భగవంతుని చిత్రములు ఎంత విచిత్రములు. మన భారత దేశమందే యిప్పుడు 80 కోట్లమంది ప్రజలుంటున్నారు. ఈ 80 కోట్లమంది దీంలోపల ఒకడూ వుండినట్లు యింకొకడు వున్నాడా? లేడు. ఎంతో వ్యత్యాసము వుంటున్నది. ఇన్ని విధములైన భేదములు సృష్టించినదెవరు? ఏసైంటిస్టయినా సృష్టించగలడా? ట్విన్సు యిద్దరుగా వచ్చినప్పటికిని వాళ్లలో వాళ్లకు కొంచెం పండ్లైనా భేదముంటాది. కండ్లైనా భేదముంటాది. ఇన్ని విధములైన భేదములుగా సృష్టించిన చిత్రకారుడు భగవంతుడు తప్పవేరొకడు లేడు.

బెట్టద తుదియల్లి హుట్టిద వృక్షక్కె
కట్టెయను కట్టి నీరెరెదవరు యారు

కొండలో రాతిపైన పుట్టిన వృక్షమునకు అక్కడెవరైనా పాదుచేసి నీరుకట్టి ఎరువువేసి పెంచారా? ఎవ్వరూ పెంచలేదు. నీవే ఆరాతిపైన పుట్టిన వృక్షాన్ని కూడను అభివృద్ధిగావించి వుంటావు.

నవిలిగె ఫింఛవను బరెదెవరు యారు
పవళద లతెగె కెంపిట్టవరు యారు?

పచ్చని చిలుకకు ఎఱ్ఱని మూతి పెట్టినది ఎవరు? దానికి ఎంతబాగా match అయిపోయింది? నెమలి వుంటుండాది. ఈ నెమలి యొక్క రంగులు ఎంత షైనింగ్ గా అందంగా వుంటున్నవి? ఈ రంగులు ఎవరు వేశారు? నీసృష్టియే. ఈనాడు ఏదైనా ఒకదానికి పెయింట్ వేస్తే artificial గా కనుపిస్తుందప్పుడే. భగవంతుని సృష్టి అంతయు కూడను సహజము. సహజము. ఇది మరొకరిచేత సాధ్యం కాదు.

కల్లినలి హుట్టి తా కూగువ ప్రాణిగె
అల్లి ఆహారవను నిర్మిసిత్తవర్యారు?

రాతిలో పుట్టిన కప్పకు అక్కడనే ఆహారమంతా ఎవరు పోయి అందిస్తున్నారు? నీవు కాదా? ఈ మధ్వాచార్యులు చక్కగా భగవంతుని వర్ణించుకుంటూ అతను అతడే. నేను నేనే. అతను Master నేను servent. అతను బింబము నేను ప్రతిబింబము. అతను sound నేను Resound. ఈ విధంగా రెండుగా ద్వైతంగా విభజిస్తూ వచ్చాడు. ఈ ద్వైతము లోనే అనంతమైన ఆనందాన్ని అద్వైతాన్ని అనుభవిస్తూ వచ్చాడు.

ఈ లోకములో దానిని అనేక మంది యిష్టపడుతూ వచ్చారు. అనేక మంది దీనిని యిష్టపడుతూ వచ్చారు. మరికొంత మంది యింకోదాన్ని యిష్టపడుతూ వచ్చారు. అదే శంకర మతము, రామానుజ మతము, మధ్వాచార్యమతము. కొన్ని కొన్ని మతములు వ్యక్తిగతమైనవిగా అభివృద్ధి గాంచుతూ వచ్చాయి. ఇది ప్రవక్తల సృష్టి. కానీ హిందూమతమనేది ఎవ్వరి చేత సృష్టించబడినది కాదు. హిందూ అనగా కేవలము భారతదేశమునకు సంబంధించినది కాదు. ఇది సర్వుల సుక్షేమము కోరేది. అందుకోసమే చెప్పారు. హిం అనగా హింస. దూ అనగా దూరము. హింసకు దూరముగా వుండేటువంటిది హిందూదేశము అని. ఆనాటినుండి నేటివరకు అన్నిదేశముల క్షేమాన్ని అన్ని ప్రాణుల అభివృద్ధిని కోరుతూ వస్తున్నది ఒక్క హిందూ మతమే. దీనినే సనాతన మతమని చెప్పుతూ వచ్చారు. దీనికోసం సనాతన మతమన్నారంటే దీనిని సృష్టించే వ్యక్తి లేడు. ఎప్పుడు వచ్చిందనే డేటు లేదు. మిగిలిన మతములకు కొన్ని కాలములంతా నిర్ణయమై వుంటున్నాయి. ఇతే హిందూమతము కఠినమైన కల్లు బాల్లకు లొంగిపోతూ వచ్చింది. ఆ కట్టుబాట్లు వుండటం చేతనే ఈనాటివరకును భారతదేశంలో ఈ సనాతన ధర్మము కదిలించేవాడుగాని, అదిలించేవాడుగాని లేడు. ఇది కేవలము పెరిగేదిగాని తరిగేది కాని కాదు. అన్ని దేశములకును సంబంధించినది యీ మతము. అందరు మానవులకును సమ సమన్వయమైనది యీ మతము. క్రిస్టియన్స్ అనికాని, ముస్లిమ్సనికాని, బౌద్ధులనిగాని, జోరాస్ట్రియనులనిగాని, సిక్కులనిగాని, పార్శీలనిగాని ఏమాత్రము భేదములు పెట్టుకోకూడదు. వీటికి పేర్లు వుంటే వుండుగాక విద్యార్థులు మాత్రము యిట్టి భేదమునకు ఎట్టి అవకాశమును అందించరాదు. అన్ని మతములను గౌరవించాలి. నీమతములో ఏదుందో ఎదురు మతములో అదే వుంటుందాది. నీ మతాన్ని నీవు అనుసరిస్తూ గౌరవిస్తూ వుంటుంటే ఒకరినొకరు విమర్శించ నక్కరలేదు కదా. ఈనాడు హిందువు హిందువని నీవు చెప్పుకుంటున్నావు. నీమతాన్ని నీవుగౌరవించటంలేదు. ఈనాడు యిస్లాం మతమని అంటున్నారు. కాని ఆ మతాన్ని వారు గౌరవించటం లేదు. క్రిస్టియన్ మతమంటున్నారు. కాని వారు ఆమతాన్ని గౌరవించటం లేదు. నిజంగా వ్యక్తిగతమైన విశ్వాసములు యీనాడు మార్పులు చెందుతూపోతున్నాయి. తోటి మానవుని చేత సోదరమానవునిగా నీవు ప్రవర్తించి జీవించు అని యిస్లాంమతం. కానీ వారావిధంగా నడుచుకుంటున్నారా? లేదు. క్రిస్టియన్ మతములో ఒక చెంప కొడితే రెండవ చెంప అందించు అని అంత సహనాన్ని నిరూపించారు. కానీ యీనాడు నిర్దాక్షిణ్యంగా

బాంబు పెట్టి నిరపరాధులనంతా ఒక్క నిముషములో భస్మము గావిస్తుండేది ఎవరు? క్రిస్టియన్సు కాదా? వారి వారి మతములు పొగడుకుంటున్నారేగాని ఆచరించటంలేదే? ఎవరెవరి మతమును వారు గౌరవించటం చాలా మంచిది. ఇతర మతములను కూడను గౌరవించటం మంచిది. ఒక వేళ గౌరవించటం నీకిష్టం లేనప్పుడు వూరుకుండు. అంతే గాని దాన్ని విమర్శించవద్దు. ఈ విధమైన విశాల భావాన్ని పెంచుకోటమే యీనాటి విద్యార్థులయందు అత్యవసరము. ఈ నాటి విద్యార్థులే భావి భారత ఉద్ధారకులు. ఎవ్వరియందు కాని ఎట్టి మతము నందుగాని ద్వేషము కాని భేదముగాని మీరు పాటించరాదు. అన్ని మతములయందు వుండిన సారం ఒక్కటే. అని నీవు తెలుసుకో. ఇదే సనాతన ధర్మము.

మీకందరికి తెలుసు. ఒక మోసంబి తీసుకుంటారు. దాంట్లో జ్యూస్ అంతా తీస్తారు. కుళ్ళిపోయినదాని రసము తీస్తారు. కాయగా వున్నదాని రసము తీస్తారు. బాగా పండిన దానినుండి తీస్తారు. అన్ని రసములు చేరుస్తారు. అన్ని రసములు చేర్చి రెక్స్ అని ఒక డ్రింకుగా పెట్టేస్తారు. ఒక్కొక్క పండురసం ప్రత్యేకంగా వుందా. అని రసములు కరుణారసముతే. అందులో ఏ ద్వేష రసముగాని ఏ దుఃఖరసముగాని, ఏ శోకరసముగాని లేదు. విడివిడిగా తీసుకున్నప్పుడు పుల్లరసమింటుండాది. తియ్యరసముంటుండాది. వగరు రసముంటుండాది. యింక కుళ్ళిపోయిన రసము కూడ వుంటున్నాది. అన్ని రసములు చేరేటప్పటికి అది కరుణారసంగా మారిపోతుంది. మార్గాల్లో పటు కూడను వేరువేరుగా వుండవచ్చు. కనుకనే మార్గాలు వేరువేరుగా వుండినంత మాత్రమున దానిలో వున్న మాధుర్యము ఏ మాత్రము మార్పురాదు. చెరకు వంకరపోతే తీపికి వంకరుంటుందా? అది ఎప్పుడూ ఒకే రసంగా వుంటుంది. అదే విధముగానే నబుద్ధులు యీవిధంగా వంకరగా వుండవచ్చునే గాని మతములలో వివిధమైన దోషములు లేవు.

మతములన్ని వేరు మార్గంబు ఒక్కటే
వస్త్ర భేదము వేరు వస్త్రమొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటె
జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడె
జాతి నీతులు వేరు జన్మమొక్కటె.

ఒకరు తల్లి గర్భమునుంచి రావటం, మరొకరు ఆకాశంనుంచి చటుక్కున వుద్భవించటం యివంతా ఏం లేదు. అందరు జన్మములో సమానులే. దైవత్వాన్ని మనం పొందాలంటే వుండేది ఒకే దివ్యత్వం. ఆ ఒక్క దివ్యత్వం అన్నింటి యందు ప్రతిబింబిస్తూనే వుంటుండాది. ఒక్కొక్క మతము ఒక్కొక్క పాత్ర వంటిది. సూర్యుడు అన్ని పాత్రలలోనూ ప్రతిబింబిస్తూ వుండినట్టుగా పాత్రలకు విలువలు తగ్గవచ్చు, ఎక్కువచ్చు. కాని ఆ పాత్రలలో ప్రతిబింబించే సూర్యునికి విలువ ఎక్కించటానికి తగ్గించటానికి వీలుకాదు. సమత్వంగానే వుంటాడు.

ఈనాడు సంకుచిత హృదయులైన వారు ఏ రీతిగా భావిస్తున్నారంటే ఒక పాత్రలో oil వుంటుంది. ఆ తైలములో చంద్రుడు కనుపిస్తున్నాడు. ఆ చంద్రుడు తైలములో కనుపించకుండా చేయాలంటే ఏమి చేస్తారు. మూర్ఖులైన వారు ఆ పాత్రను నిప్పులో పెట్టి కాస్తూ వస్తుంటారు. కాని వివేకవంతుడు ఏమి చేస్తాడు? ఈ ప్రతిబింబమునకు మూలకారణమేమిటి తైలము. తైలమును తీసివేస్తే దాని ప్రతిబింబము ఇక్కడ వుండదు. పాత్రను ఎంత కాచినా ప్రయోజనం లేదు. అదే రీతిగా మన దేహమొక పాత్ర. ఈ దేహపాత్రలో ప్రతిబింబం దాన్ని మనం దూరం చేయాలనుకొని దేహాన్ని అనేక రకములైన హింసలు పెడుతున్నాం. ఏమిటి ఆ హింసలు? ఉపవాస వ్రతాలు. తిండి తినకుండా ఏదో దేవుని వ్రతములని చెప్పుకోటం శరీరాన్ని కృంగ చేసుకోటం తద్వారా బలహీనం కావటం. ఈ బలహీనత వలన మనస్సు యొక్క బలం తగ్గిపోవటం. ఎందుకివన్నీ. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః. 'నీ హృదయములో నేను వైశ్వానరుడుగా వుంటున్నాను. నీవు తినేదంతా భగవంతునికి అందించినట్టుగా భావించు. ఎంత పవిత్రమై పోతావు. నేను తింటున్నాను. నేను తింటున్నాను అనే భావములో తినవద్దు. తననుంచి వస్తుందాది. అహం వైశ్వానరో భూత్వా' నేను ప్రతి భూతమునందు కూడను వైశ్వానరుడుగా వుంటున్నాను. కనుక ఆ భావములో ఏది చేసినప్పటికి భగవంతునికి నేను నైవేద్యంగా అందిస్తున్నాను. నాలో వుండిన భగవంతుడే దీన్ని ఆరగిస్తున్నాడు. జీర్ణకోశాన్ని ఉదరమున చేర్చిన దెవరు? మన ఉదరములో ఈ జీర్ణకోశాన్ని ఎవరు చేర్చారు? జనన మరణాలు ఎవరిచే కలుగుచుండెనో దాని గుర్తించటానికి ప్రయత్నించాలి. అదే మానవుని యొక్క వివేకం. అట్లు కాకుండా ఏదో ఏకాదశి రోజు ఉపవాసాలు వుండటం, మూడు నాలుగు దినాలంతా ఏమీ తీసుకోకుండా పోవటం తరువాత దానికి డబుల్ డబుల్‌గా తీసుకోటం. ఇంకా కొంతమంది వుంటారు. మధ్వమతములో భీష్మైకాదశి అని ఒకటి వస్తుంది. భీష్మైకాదశి అంటే కఠినమైన వ్రతము. భీష్ముడు కఠినవ్రతమును పూనుకున్నాడు కదా! అదే రీతిగా ఒక కఠినమైన ఉపవాస వ్రతము. ఏమిటి ఆ ఏకాదశి అంటే తనకు వచ్చిన ఉమ్మిని కూడను మింగకూడదు. అంత వ్రతము. అట్లు మూడు దినములు వ్రతము చేస్తారు. నాలుగో దినము చక్కగా భోజనము చేస్తారు. ఈ మతములోపల ఒక పద్ధతి వుంటుండాది. మధ్వమత సిద్ధాంతమంటే దాన్ని వదలవద్దు. బిడబేడి బెట్టుకెడబేడి' దాన్ని విడచిపెట్టి నీవు విడిపోవద్దు. విడిపోయి తిరిగి దాన్ని పట్టవద్దు. ఇది వాళ్ళ యొక్క భాష్య తత్త్వం. చాలా మంచిదేయిది. ఇదే విడవద్దు. విడిచి తిరిగి పట్టుకోవద్దు. కనుక ఆ పద్ధతులనంతా నీవు చక్కగా అనుసరించు. ఇదే ప్రతి మతములో కూడ కొన్ని కొన్ని బలహీనతలుంటున్నాయి. భీష్మైకాదశి ప్రారంభిస్తారు వాళ్ళ పని అంతా ఏమిటి తెలుసునా? పిండిని రుబ్బటము. దోసకు తగిన ఏర్పాట్లంతా చేసుకోటము. ఈ మూడు దినములంతా పిండినంత చక్కగా మాగపెట్టడము. మూడు దినములైతే అది చక్కగా వుప్పొంగుతుంది. పొంగుతుంది దోసె. దీనినే కొన్ని పదములలో చెబుతారు.

ఇందు మూడిదె ఏకాదశి, ఒందు తిందు నలవత్తు దోశె. ఏకాదశి ఏకాదశి అని చెప్పి నలభై దోశలకు పిండి కలిపి పెట్టుకుంటారట. ఇంక ఎందుకు యీ ఏకాదశి చెయ్యాలి? ఇతా అందరు కాదు. కొందరు అట్లా వుంటారు. ఇంక వైష్ణవులందు కూడను యిదే పద్ధతి వుంటుండాది. వైష్ణవ అంటే అర్థం ఏమిటి? విశ్వవ్యాపకత్వమైన దివ్యత్వాన్ని చింతించటమే వైష్ణవం. విష్ణువనగా సర్వవ్యాపకుడు. అనంతమైన అంగములతో ఒక లోకమునకు దిగివచ్చిన వాడు. ఎక్కడ చూచినా అతనే వుంటుండేది. ఈ సిద్ధాంతమును నమ్మినవాడు యీ భేధాలెందుకు. అన్ని మతములయందు కొన్నిటిని విశ్వసిస్తున్నారు గాని విచారణ ద్వారా వివేకము ద్వారా అనుభవించటానికి ప్రయత్నించటంలేదు.

విద్యార్థులారా! ముఖ్యంగా యీ మతభేధములు మీరు పెట్టుకోకండి. అన్ని మతములందు వుండిన దైవము ఒక్కడే. అట్టి భావము చేత అన్ని మతములను గౌరవించండి. అన్ని మతముల సారమును ఒక్క మతమునందే మీరు అనుభవించండి. వాదోపవాదములను పూనుకోకండి. మీరు ఒక మతమును మరొక మతంగా విమర్శించకండి. ఈ దూషణలనేవి చాలా ప్రమాదము. నీవు ఏదో ఒక మతమును దూషిస్తున్నప్పటికి నిన్ను నీవు దూషించిన వాడౌతావు. అందరికి ఒక నమస్కారం చేయండి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికి చేసిన నమస్కారం ఆ కేశవునికి చెందుతుంది. ఆవిధమైన సమభావము చేత ప్రేమభావాన్ని పెంచుకొని విశాలత్వము చేత విశ్వాన్ని విశ్వసించి విష్ణుత్వాన్ని పొందండి. ఇదే మతము యొక్క ప్రధానమైన సారము.